
ప్రజాశక్తి
సోమవారం 6 అక్టోబర్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నెల్లూరు :ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 7న నిర్వహించతలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్టేటి రమేష్ పిలుపు నిచ్చారు. ఆదివారం నగరంలోని ఏబివిఎం కాంపౌండ్ నుంచి వి.ఆర్.సి సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ఫ్యాప్టో నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫ్యాప్టో చైర్మన్ కె. మధుసూదన అధ్యక్షత వహించారు. ఆయనతోపాటు . ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ జావిద్ మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. చైర్మన్ మధుసూదనరావు, సెక్రటరీ జనరల్ జావీద్, కో చైర్మన్ లు మురళీకృష్ణ, మాస ప్రసాద్, మాధవ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ శేషులు,నరసింహం, హజరత్,పిచ్చిబాబు, నాయకులు పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగులు ఆందోళన

అడ్డుకున్న పోలీసులు -విఆర్‌సి క్రీడా మైదానం వద్ద ఉద్రిక్తత..



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-నెల్లూరు

సచివాలయ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఆందోళనకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకోవడంతో విఆర్‌సి క్రీడా మైదానం వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసు 30 యాక్టు అమలులో ఉందని, సభలు, ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేపట్టడం నిషేధమంటూ పోలీసులు సచివాలయ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. సచివాలయ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి నాయకులు బి.మధుబాబు, ఎం.శేషుబాబు, బి. జగదీష్లు మీడియాతో మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తుంటే పోలీసులు అమానుష చర్య అన్నారు. నగరంలో సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ కార్యక్రమం నిర్వహించడంతోపాటు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించేందుకు తాము సిద్ధపడ్డామని. ఈ కార్యక్రమాలను పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇంటింటి సర్వే పేరుతో సచివాలయ ఉద్యోగులను మానసిక ఒత్తి గురిచేస్తుందని వాపోయారు. కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల గొంతు నొక్కేందుకు మాత్రమే ఇటువంటి చర్యలకు పాల్పడుతుందని, ఈ చర్యలు దారుణమన్నారు. తమ సమస్యలు పరిష్కరి ంచేందుకు భవిష్యత్తు కర్తవ్యాన్ని నిర్ణయించుకొనేందుకు తాము సమావేశాలు నిర్వహించుకుంటే పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. రాష్ట్ర జెఎసి నాయకులు, జిల్లా జెఎసి నాయకులు, జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవాలి

'వ్య. కా.స' రాష్ట్ర కార్యదర్శి కంకణాల ఆంజనేయులు -ఘనంగా జిల్లా 20వ మహాసభ

ప్రజాశక్తి - కోవూరు

సంక్షోభంలో కూరుకుపోయిన వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 20 మహాసభలు ఆదివారం కొడవలూరు మండలం, యల్లాపాలెంలోని చేవూరు సుబ్బరా మిరెడ్డి కళ్యాణ మండపం(కామ్రేడ్ జిల్లా మస్తానయ్య ,వంజివాక వెంకయ్య బట్టె పాటి శామ్యూల్ ప్రాంగణం)లో జరిగాయి. మహాసభలకు అధ్యక్ష వర్గంగా జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమ్మ రాజు, తాళ్లూరు మాల్యాద్రి పోతుకుంట దేవ కుమారి వ్యవహరించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కంకణాల ఆంజనేయులు హాజరయ్యారు. మహాసభల్లో ఆ సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, అధ్యక్షుడు జొన్నల గడ్డ వెంకమ రాజు జిల్లా నాయకులు ఎం మోహన్ రావు, నాయకులు ఎస్ డి మహబూబ్ బాషా దేవకుమారి, నాగమ్మ పాల్గొన్నారు. మహాసభ అనంతరం గ్రామంలో ప్రదర్శన- బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రధాని పదవిలో కూర్చున్న తర్వాత దేశానికి అన్నం పెడుతున్న వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలోకి వెళ్లిందని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగంలో ఉన్న రైతులు వ్యవసాయ కూలీలు జీవనస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. పారిశ్రా మికవేత్తలకు దేశ సంపదనంతా కట్టబెడుతున్నారన్నారు. రైతులు, వ్యవసాయకూలీల నోట మట్టి కొడుతున్నారన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్షులుగా జొన్నలగడ్డ వెంకమ రాజు కార్యదర్శిగా మంగళ పుల్లయ్య ఆఫీస్ బేరర్స్ గా ఎం మోహన్ రావు, తాళ్లూరు మాల్యాద్రి, ఎస్కే అన్వర్ భాషా ,నక్కా రాదయ్య ,బి, పెద్దబ్బయ్య పి,దేవకుమారి,బి. నాగమ్మ, ఎం రామచంద్రయ్య,పి మధు, టి దేవదానం టి నారాయణ పి, మస్తానయ్య ఎన్నికయ్యారు. మరో 20 మంది కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



వ్య.కా.స జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమరాజు, మంగళ పుల్లయ్య

'పెన్నా'లో ఇద్దరు యువకులు గల్లంతు

ఒకరి మృతదేహం లభ్యం.. మరొకరి కోసం గాలింపు..

ప్రజాశక్తి-నెల్లూరు

ఈత సరదా ఇద్దరు యువకులను కాటేసింది. నెల్లూరు పరిధిలోని దేవరపాళెం, ఐఎంఎల్ డిపో ప్రాంతానికి చెందిన కోటయ్య (20), విశాల్ (21) సరదాగా ఈత కొట్టేందుకు పెన్నానదిలోకి దిగారు. ప్రవాహం పెరగటం కారణంగా ఆ ఇద్దరు యువకులు కొట్టుకొని పోవడాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే వారిని కాపాడేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఈ సమాచారం పోలీసులకు, రెవెన్యూ అధికారులకు చేరింది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే గజ ఈతగాళ్ల సహాయంతో నీటిలో కొట్టుకొని పోయిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. జొన్నవాడ బ్రిడ్జి ప్రాంతం వద్ద పెన్నా నదిలో ఇద్దరు యువకులు గల్లంతైన సమాచారం తెలుసుకున్న టిడిపి నాయకులు కొటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆ ప్రాంతానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే వెంకటగిరి నుంచి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించే ప్రయత్నం చేశారు. గజ ఈతగాళ్ల గాలింపు చర్యల్లో భాగంగా విశాల్ అనే యువకుడి మృత దేహాన్ని గుర్తించి పెన్నానది వడ్డుకు తీసుకురావడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం మృతుని కుటుంబ సభ్యులు ఆక్రందనలు మిన్నంటాయి. మరో యువకుడు కోటయ్య కోసం గజ ఈతగాళ్లు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు.



ఒడ్డుకు చేర్చిన విశాల్ మృతదేహం

లైసెన్స్ కలిగిన ఆటోడ్రైవర్లకు

వాహన మిత్ర పథకం వర్తింపజేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

కూటమి ప్రభుత్వం లైసెన్స్ కలిగి ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు వాహన మిత్ర పథకం వర్తింప చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు, ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జివో నెంబరు 21ని రద్దు చేస్తామని చేసిన హామీని అమలు చేయాలని ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కోలగట్ల సురేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వాహన మిత్ర పథకాన్ని ఎటువంటి ఆంక్షలు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కె.పెంచలయ్య, డి.లక్ష్మిపతి, ఆర్.రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆటో కార్మిక సంఘం నాయకులు

వ్యాధుల నివారణపై అవగాహన


ప్రజాశక్తి-నెల్లూరు

మెదడు, వెన్నుపూస, నరముల వ్యాధులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని చెన్నై కంచి కామకోటి చైల్డ్ ట్రస్ట్ హాస్పిటల్ చిన్నపిల్లల మెదడు, నరాల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.మహేష్ అన్నారు. ఆదివారం, పొగతోటలోని రిచ్ హాస్పిటల్ సమావేశ మందిరము నందు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో వరల్డ్ ప్రపంచ మెనంజైటీస్ అవగాహన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎస్. మహేష్ మాట్లాడారు.

మద్యంపై జగన్‌రెడ్డి వ్యాపారం

ఎంఎల్‌ఎ సోమిరెడ్డి విమర్శ

నెల్లూరు ప్రతినిధి :ప్రమాదకర మద్యంతో అమాయకుల ప్రాణాలు తీసిన వారిని పదవులిచ్చి ప్రోత్సహించిన చరిత్ర మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డిది అని సర్వేపల్లి ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. మద్యం గురించి జగన్ రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అన్నమయ్య జిల్లాలో కల్తీ మద్యం కేంద్రంపై ఎక్సైజ్ శాఖ అధికారులు రైడ్ చేసి పట్టుకున్నారన్నారు. కల్తీ మద్యం రాష్ట్రమంతా జరుగుతోందని, సీఎం చంద్రబాబు నాయుడే ప్రోత్సహిస్తున్నారని జగన్ రెడ్డి అర్థం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా జగన్ రెడ్డి సారధ్యంలోనే హెూల్ సేల్ గా కల్తీ మద్యం వ్యాపారం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రూ.3500 కుంభకోణం దేశంలోనే ఒక సంచలనం అన్నారు.



మాట్లాడుతున్న సోమిరెడ్డి

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి - నెల్లూరు :డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని టిడిపి నాయకులు గిరిధర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. స్థానిక కాకుటూరులో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నేతలు ఆవిష్కరించారు. నగర మాజీ మేయర్ నందిమండలం భాను శ్రీ, మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ కోసూరు సుభాషిణి, గ్రామ ఉప సర్పంచ్ సాల్మన్, ఏ.ఎం.సి. డైరెక్టర్ కాకుపల్లి శివకుమార్ ఉన్నారు.

హత్య కేసును నీరుగారుస్తున్నారు..!

బాధిత కుటుంబం ఆవేదన - నిందితుడిని అరెస్ట్ చేయాలని జనసేన డిమాండ్

ప్రజాశక్తి -గుడ్లూరు

సాధారణ కేసుల మాదిరే హత్య కేసును కూడా పోలీసులు నీరు గారుస్తున్నారని బాధిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దసరా పండగ రోజున మండలంలోని రాళ్లపాడు వద్ద జరిగిన ప్రమాదం పథకం ప్రకారం జరిగిందని, యువకుడిని దారుణంగా హత్య చేసి మరో ఇద్దరు యువకుల్ని తీవ్రంగా గాయపరిచి ఆస్పత్రిపాలు చేసిన నేరస్తుడిని ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని బాధిత కుటుంబం బంధువులు ఆరోపిస్తున్నారు.

గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి చెందిన తిరుమలిశెట్టి లక్ష్మీ నాయుడు తన తమ్ముడు పవన్, బాబాయి కుమారుడు భార్గవ నాయుడు కందుకూర్‌లో కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనానికి సంబంధించిన కాగితాల కోసం బైక్‌పై కందుకూరు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన కాకర్ల ప్రసాద్ కందుకూరు నుంచి కారులో దారకానిపాడు వస్తూ మార్గమధ్యలో గొల్లపాలెం-రాళ్లపాడు మధ్యలో ఎదురుపడిన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు కింద పడిపోయారు. వారిలో వారిలో లక్ష్మీ నాయుడుపైకి కారు ఎక్కించి తొక్కించడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని కందుకూరు వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనతో నిందితుడు కాకర్ల ప్రసాదు కారుని అక్కడే వదిలేసి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. అయితే ఈ హత్య పథకం ప్రకారం జరిగిందని తెలుసుకున్న బంధువులు, సంఘటనా స్థలానికి చేరుకొని నిందితున్ని పట్టుకునేందుకు ప్రయత్నం చేశారు.అప్పటికే నిందితుడు పరారయ్యాడు. ఒంగోలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మతుడి తమ్ముడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని ఇప్పటి వరకు అరెస్టు చేయలేదు.

నిందితుడిని అరెస్ట్ చేయాలి : జనసేన

ఈ ఘటనపై జనసేన ప్రకాశంజిల్లా కార్యదర్శి డేగల దొరసాని నాయుడు గుడ్లూరు మండల నాయకులు చలపతి, అనిమిశెట్టి మాధవ, మహేష్ కేశవరపు లక్ష్మణ్ కంట రత్తయ్య కొనికి రాజేష్, వంశీ, తిరుపాలు స్పందించారు. పోలీసులు కావాలనే పథకం ప్రకారం కేసును నీరుగార్చుతున్నారని ఆరోపించారు.పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి నిందితుడిని అరెస్టు చేసి శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు ఆదివారం పోలీసులకు విజ్ఞప్తి చేశారు.



పోలీసులతో మాట్లాడుతున్న జనసేన నేతలు

రక్తదానం మిన్న

ప్రజాశక్తి-కందుకూరు : ఒంగోలులోని కిమ్స్ ఆస్పత్రిలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఒక పేషెంట్ కి అత్యవసరంగా బి+ రక్తము అవసరము అని తెలుసుకున్న బ్లడ్ డోనర్స్ వాట్సప్ గ్రూప్ సభ్యుడు అయిన కందుకూరు పట్టణ సి.ఐ డ్రైవర్ షేక్.అహ్మద్ బాషా వెంటనే స్పందించి కందుకూరు నుండి ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్ కి వెళ్లి రక్తదానం చేసారు.అత్యవసర సమయంలో రక్తదానం చేసిన షేక్.అహ్మద్ బాషాకి పేషంట్ తరపు బంధువులు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కందుకూరు రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ చన్నా వెంకట రామాంజనేయులు మాట్లాడుతూ షేక్ అహ్మద్ బాషా ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎవరైనా ఆపదలో ఉన్నవాళ్ళకి గానీ లేదా ఎక్కడైనా రక్తదాన శిబిరాలు జరుగుతు న్నప్పుడు గానీ రక్తదానం చేస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపాడారనీ అతని యొక్క సామాజిక బాధ్యత మరియు సేవా దక్పథం అభినందనీయం మరియు స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ఆపద సమయంలో రక్త దానం చేస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపాడుతూ రక్తదానంలో కందుకూరు సబ్ డివిజన్ పోలీసులు సాటి పోలీసు సిబ్బందికి ఆదర్శవంతంగా నిలుస్తున్నారని అభినందించారు.



బధిరుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రపంచ బధిరుల, అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవాన్ని నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిఆర్‌ఒ విజయ్ కుమార్ మాట్లాడుతూ వైకల్యం శరీరానికి మాత్రమేనని సంకల్పానికి కాదన్నారు. వైకల్యము కలిగి జీవితములో అత్యున్నత స్థాయికి చేరిన వారి జీవితాలను ఆదర్శముగా తీసుకొని తమ జీవితములో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లాలో బధిరుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు మహమ్మద్ అయూబ్, జిల్లా బదిరుల సంక్షేమ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపు సరికాదు : సిఐటియు

ప్రజాశక్తి - ఉలవపాడు :రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాలలో 8 నుంచి 13 గంటలకు పనిగంటలను పెంచి కార్మికులపై పనిభారాన్ని పెంచే నిర్ణయాన్ని ఉపసం హరిం చుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కట్టా సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఆదివారం ఉలవపాడులో మీర్ మెమోరియల్ స్కూల్లో సిఐటియు ఉలవపాడు 5వ మండల మహాసభలు జరిగాయి. మహాసభకు అధ్యక్ష వర్గంగా చిలకా శ్రీనివాసులు, వీసం. విజయ్, సిహెచ్ ఇందిరావతి వ్యవహరిం చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కట్టా సుబ్రమణ్యం మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రతరం చేశాయని విమర్శించారు. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లు గా మార్చి, కార్మికులను కట్టు బానిసలుగా మార్చుతుందని దుయ్యబట్టారు



ఉలవపాడులో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం 11 మందితో సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. సిఐటియు మండల కన్వీనర్‌గా వీసం విజయ్‌కుమార్, కో కన్వీనర్‌గా సిహెచ్ ఇందిరావతి, కోశాధికారిగా నాళం శ్రీదేవిని, కమిటీ సభ్యులుగా కె.వి.రమణ, కే శైలజ, డి వరలక్ష్మి, చిలకా శ్రీనివాసులు, టి సుజాత, ఎరాజారాం, చిరుతోటి. శ్రీనువాసులు, గంజి శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజాశక్తి -సైదాపురం

పని గంటల పెంపు సరికాదని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. సిఐటియు సైదాపురం మండల కమిటీ సమావేశం ఆదివారం సైదాపురంలోని ఎంఎస్ కాలనీలో నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు అల్లాడి గోపాల్, పి శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. కుటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పనిని నుంచి 12 గంటలకు పెంచడం దుర్మార్గమన్నారు. కార్మికులు కడుపు కొట్టే విధంగా ఎనిమిది గంటల పనిని 12గంటల పనికి పెంచే జీవోని పాస్ చేయడం కార్మికులకు కడుపు కొట్టే విధంగా ఉందన్నారు. అంగన్‌వాడీ, ఆశ, వర్కర్లకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 11 12 తేదీల్లో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.



సైదాపురంలెఓ..

అనంతరం సిఐటియు సైదాపురం మండల కమిటీ 12మందితో ఎన్నుకున్నారు.కన్వీనర్‌గా భవాని,కో కన్వీనర్ సంక్రాంతి, ట్రెజరీగ, లక్ష్మీ ప్రసన్న ,కమిటీ సభ్యులుగ జయసుధ,సుజాతమ్మ, హరిత, శ్రీనివాస్, రత్నగిరి, ఎస్ కె మస్తాన్, మమతను ఎన్నుకున్నారు. సిఐటియు,నాయకులు ప్రమీలమ్మ, సుజాతమ్మ ఉన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు :పట్టణంలోని జనార్ధనస్వామి దేవస్థానం సమీపంలో గల సత్యసాయిబాబా దేవస్థానంలో వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆర్టీఐ జిల్లా కార్యనిర్వాహక సభ్యులు, ప్రముఖ నాయకులు తాటికొండ వెంకట్రావ్ ఆర్థిక సహాయంతో పలువురు పేదలకు ఆదివారం చీరలు. దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాటికొండ వెంకట్రావ్ మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు పేద ప్రజలను అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, మానవుల పట్ల ప్రేమ, శాంతి, సహాయం వంటి సూత్రాలను బోధించిన సత్యసాయిబాబా స్ఫూర్తి ఆదర్శనీయం అన్నారు. ఆ మహాత్ముడు బోధించిన విధంగా పేదలను అదుకునేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నానని, భవిష్యత్తో మరింత విస్తతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. సత్యసాయిబాబా దేవస్థాన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కుసుమ కుమారికి అభినందనలు

ప్రజాశక్తి -కందుకూరు :శ్రీకాళహస్తి వాయు లింగేశ్వర స్వామి దేవస్థాన పాలకమండలి సభ్యురాలుగా నియమితులైన కందుకూరు టిడిపి అబ్సర్వర్ బ్రాహ్మణ కె కుసుమ కుమారిని ఒంగోలులోని వారి స్వగహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.కందుకూరు బ్రాహ్మణులు మంచిరాజు మురళీ, నందనవనం రామ సుబ్బారావు, నారాయణం రాధాకష్ణమాచార్యులు, చలంచర్ల సుబ్బారావు,రమణమూర్తి పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు .. పొంచి ఉన్న ప్రమాదం..

ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్

గుడ్లూరు మండలంలోని పరకొండపాడులో వాటర్ ప్లాంట్ నుంచి కొండారెడ్డి పాలెం రోడ్డు దాకా మూడు స్తంభాలు ఉండాల్సిన చోట రెండు స్తంభాలు వేశారు. దీంతో అక్కడ విద్యుత్ తీగలు సుమారుగా 6 అడుగుల ఎత్తులో మనిషికి అందే విధంగా వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. గాలులు వీచినప్పుడు తీగలు జాయింట్ కావడంతో మంటలు చెలరేగుతున్నాయి. ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే ప్రమాదముందని, .ఇళ్లలోని ఫ్యాన్లు. టీవీలు. ఫ్రిజ్‌లకు నష్టం జరిగే అవకాశముందని చెబుతున్నారు.విద్యుత్ తీగలు ప్రమాదకరంగా లేకుండా చూడాలని ఆ గ్రామ సర్పంచ్ కోల కొండయ్య, సచివాలయ సెక్రటరీ, మండల ఎఈకి ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేదని స్థానికులు చెబుతున్నారు. పర కొండ పాడు వాటర్ ప్లాంట్ దగ్గర నుంచి అంగన్‌వాడీ సెంటర్ దాటి కొండారెడ్డి పాలెం వెళ్లే దారి వరకు స్తంభాలు ఒరిగి కరెంట్ తీగలు ఇళ్లపై వాలి ఉన్నాయి. ప్రమాదం పొంచి ఉన్నా ఉన్నతా ధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని చెబు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి తీగలు ఎత్తులో ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు. ఈ సమస్యను ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాలనే యోచనలో ఉన్నారు.



వేలాడుతున్న విద్యుత్ తీగలు

నేడు మాజీ ఉపరాష్ట్రపతి రాక

ప్రజాశక్తి-నెల్లూరు :భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు నేటి నుంచి ఈ నెల 9వ తేది వరకు జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 9న తిరుపతి విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-కందుకూరు : లైన్‌కు తగిలే చెట్ల కొమ్మలు తొలగించుటకు 11 కేవీ వెంకటాద్రిపాలెం ఫీడర్ నందు సోమవారం ఉదయం9 గంటల నుండి ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని అసిస్టెంట్ ఇంజనీర్ టి నరసింహం తెలిపారు. ఆఫీడర్ పరిధిలోని ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు పొదలకూరు రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి :నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు నేడు ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు రూ 11 కోట్ల రూపాయలతో ఎస్‌పి కార్యాల యం నుంచి పొదలకూరు రోడ్డు ఆధునీకరణ, సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ మరియు వివిధ అభివద్ధి పనులను చేశారు. ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఆదివారం కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని సమీక్షించారు.

వైభవంగా గంగమ్మ పొంగళ్లు..

ప్రజాశక్తి - లింగసముద్రం


మండలంలోని గంగపాలెంలో గంగమ్మ దేవత పొంగళ్లను వైభవంగా నిర్వహించారు.ఆదివారం ఉదయం గ్రామస్తులు ఊరేగింపుగా గంగమ్మ దేవాలయం వద్దకు వెళ్లి పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా బాణాసంచా కాలుస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, గంగపాలెం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ సేవలు


ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరులో కుల, మతలకతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ వస్తున్న నిరుపేదలు అయిన వితంతవులకు, వద్ధులకు ఇంటికి సరిపడ నెలవారి నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం ఉద్యోగరీత్యా అందరికి సేవలు అందిస్తూ మంచి మనసుతో ఆలోచించే,సమాజసేవలో ఎప్పుడు ముందు ఉండే, అడగంగానే వెంటనే స్పందించి సహాయం అందించే ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ ఆత్మబంధువు కె విజయభాస్కర్ (గుడ్లూరు మండలం) తహసిల్దార్ సహాయంతో 15 మందికి అందజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన విజయ భాస్కర్‌కి ధన్యవాదాలు తెలుపుతూ,ప్రతి ఒక్కరు పేదవారికోసం సామాజిక బాధ్యతగా తోచినంత సహాయం అందిస్తే మరింత మందికి సహాయం అందించే దిశగా ఫౌండేషన్ అడుగులు వేస్తుంది అని ఫౌండేషన్ సెక్రెటరీ షంషేర్ తెలిపారు సంస్థ అధ్యక్షుడు సాజిద్, ట్రజరర్ హాఫీజ్, టౌన్ ఇంచార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, షమ్ షఉద్దిన్,సయ్యద్ సందాని పాల్గొన్నారు.



'రాళ్లపాడు' జలాశయంలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - లింగసముద్రం :రాళ్లపాడు ప్రాజెక్టులో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం నీటిలో తేలాడుతుంది. ఆదివారం సాయంత్రం రాళ్లపాడు ప్రాజెక్టు కొత్త గేట్లు పాత గేట్లు మధ్యలో ఉన్న స్థలంలో ఫోటో లు తీసుకునేందుకు కొంతమంది యువకులు అక్కడికి వచ్చారు. ఆ సమయంలో ప్రాజెక్టులోని నీటిని పరిశీలించగా అక్కడ ఉన్న మతదేహాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న లింగసముద్రం ఎస్‌ఐ నారాయణ తన సిబ్బందితో కలిసి రాళ్లపాడు ప్రాజెక్టు వద్దకు వచ్చి నీటిలో తేలాడుతున్న మతదేహాన్ని పరిశీలించారు. మతదేహం పై డ్రాయర్ తప్ప ఒంటిమీద ఎలాంటి దుస్తులు లేవు. నీటిలో తేలాడుతున్న మతదేహం మొహం నీటిలో ఉండటంవల్ల వీపు భాగం మాత్రమే కనిపిస్తుంది. 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని తెలుస్తోంది. బయటికి తీసేందుకు చీకట పడడంతో సోమవారం తీస్తామని ఎస్‌ఐ తెలిపారు. అయితే రెండు మూడు రోజుల కిందటే మతుడు ప్రాజెక్టులో పడి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి మతదేహం వచ్చి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



జలాశయంలో ఉన్న మృతదేహం

నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై చర్యలు

నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.కనకాద్రి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-నెల్లూరు

ప్లాస్టిక్ వస్తువులను ఎక్కువగా వినియోగించడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టరు ఎం.కనకాద్రి పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం పరిరక్షణకు, పరిసరాల పరిశుభ్రతను పెంపొందించేందుకు కార్పొరేషన్ శానిటైజేషన్ సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తుంటారని తెలపారు. అదే సమయంలో ఈ ప్రమాదాన్ని ప్రజలు గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకొని పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో ఆయన మాటల్లోనే..



ప్రశ్న. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం వల్ల పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుంది. ముఖ్యంగా క్యారీ బ్యాగులు వినియోగం, డిస్పోజబుల్ గ్లాసులు, వాటర్ బాటిల్స్ వంటి వాటిని ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. దానివల్ల పర్యావరణం దెబ్బతింటుంది ఈ నేపథ్యంలో వీటి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు..?

జవాబు. 30 సంవత్సరాల క్రితం ప్రజలు గుడ్డ సంచులు వినియోగించే వారు. ప్రస్తుతం రోజువారీ జీవన విధానంలో ప్లాస్టిక్ వినియోగం ప్రధాన భూమికను పోషిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల నిర్వహించిన పరిశోధనల్లో మనిషి రక్తంలో సైతం మైక్రో పరిధిలో ప్లాస్టిక్ ఉన్నట్లు గుర్తించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే ప్రమాధాన్ని, పర్యావరణం దెబ్బ తింటుందన్న హెచ్చరికలు వస్తున్న నేపథ్యంలో గతంలో 50 మైక్రాన్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ వస్తువులను నిషేదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 120 మైక్రోన్లకన్నా తక్కువ స్థాయి గల సింగల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ, రవాణా, విక్రయం తదితరాలను నిషేదిస్తున్నాం. స్టీక్ వినియోగంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, వాటి స్థానంలో మరో వస్తువులను వినియోగించుకొనే విధంగా ప్రజలను చైతన్యం పరిచేందుకు వ్యూహరచన చేస్తున్నాం.

ప్రశ్న. స్వర్ణాంధ్ర -2047 లక్ష్య సాధనకు కార్పొరేషన్ నగరంలో ఎటువంటి కార్యక్రమాలు చేపడుతుంది.?

జవాబు. స్వర్ణాంధ్ర - 2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రతినెల మూడవ శనివారం నాడు "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్" కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణ చర్యలలో భాగంగా సింగల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నాం. నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీదారులు, రిటైలర్లు తగిన జాగ్రత్తలు తీసుకొని నిషేధించిన ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీని ఇకనుంచి కచ్చితంగా ఆపివేయాలని హెచ్చరికలు జారీ చేశాం. క్రమం తప్పకుండా ప్లాస్టిక్ ఉత్పత్తుల దుకాణాలపై దాడులు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలకు భారీ స్థాయిలో జరిమానాలు విధిస్తాం.

ప్రశ్న. ప్లాస్టిక్ వస్తువులను వినియోగించిన ప్రజలు నిర్లక్ష్యంగా ఎక్కడికక్కడే వదిలివేయడం వల్ల (ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, క్యారీ బ్యాగులు, డిస్పోజిబుల్ గ్లాసులు) డ్రెయినేజీ కాలువల్లో ప్రవస్తున్న నీటికి అడ్డంగా పడిపోవడం వల్ల రహదారులపైకి మురుగు నీరు చేరుతుంది. దానివల్ల దోమలు నగరంలో స్వైర విహారం చేస్తున్నాయి. నివారణకు కార్పొరేషన్ ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు ప్రతినిత్యం ఇంటింటికి వెళ్ళి చెత్త సేకరణ చేస్తున్నారు. ఒకటి పొడి చెత్త, మరొకటి తడిచెత్త సేకరణకు ప్రజలు వినియోగించుకుంటున్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలి. ఇల్లే కాకుండా తమ చుట్టు ఉన్నా సమాజం కూడా పరిశుభ్రంగా ఉంచుకునేందుకు జాగ్రత్తలు పాటించాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పూర్తి స్థాయిలో విజయవంతం కావాలంటే ప్రభుత్వ అధికారులతోపాటు ప్రజల సహకారం అవసరం కావాలి. ఇటీవల కాలంలో 54 డివిజన్ల పరిధిలో డ్రెయినేజీ కాలువలను క్లీన్ చేశాం.



వైద్యం చేస్తున్న డాక్టర్ ఎం వి రమణయ్య

తక్కువ ఖర్చుతో వైద్యాన్ని ఉపయోగించుకోండి..

- డాక్టర్ ఎంవి రమణయ్య

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పరిసర ప్రాంత ప్రజలు తక్కువ ఖర్చుతో నిర్వహించే వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని డాక్టర్ ఎంవి రమణయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని జన విజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో షుగర్, బిపి, గుండె సంబంధిత వ్యాధులకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఎంవి రమణయ్య, డాక్టర్ సుజన, డాక్టర్ బాలకృష్ణ వ్యాధిగ్రస్తులను పరీక్షించి 2 నెలలకు సంబంధించి మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 150 మంది పేషెంట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు కేసీ కృష్ణయ్య, జెవివి జిల్లా నాయకులు ఒంటేరు మల్లికార్జున యాదవ్, జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు హరికృష్ణ, మురళీకృష్ణ, సాదిక్ హుస్సేన్ ,డాక్టర్ కె ఎన్ రాజు,సందాని,కోలా నాగేంద్ర, రమేష్ బాబు, కృష్ణమోహన్, నజీర్, వేము పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



అభినందన సభ నిర్వహించిన నిర్వాహకులు

కోవూరు వాసికి బంగారు పతకం

ప్రజాశక్తి కోవూరు

జాతీయ స్థాయిలో మరోసారి కోవూరు ప్రతిభ వెలుగొందింది. గత నెల 28, 29, 30 తేదీలలో విజయవాడలో నిర్వహించిన జాతీయ యోగా పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొన్న కోవూరు చైతన్య యోగా కేంద్రం శిక్షకురాలు పి.ప్రసన్న అద్భుత ప్రదర్శనతో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని చైతన్య యోగాకేంద్రం ఆధ్వర్యంలో అభినందన సభ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి యోగా గురువు జనార్ధన్ అధ్యక్షత వహించగా, పతంజలి యోగా జిల్లా అధ్యక్షులు రమణయ్య, యోగా మాస్టర్ శ్రీను ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పలు రాష్ట్రాల ప్రతినిధులను ఓడించి పసిడి పతకం సాధించిన పి.ప్రసన్న కృషి, పట్టుదల అనితరసాధ్యం అని ప్రశంసించారు. అనంతరం ఆమెను శాలువాతో సత్కరించి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా పి.ప్రసన్న మాట్లాడుతూ ఈ విజయానికి తన గురువులు జనార్దన్, రమణయ్య, శిక్షకుడు శ్రీను, యోగా సాంకేతిక కార్యదర్శి అనిల్, సింహపురి యోగా కార్యదర్శి పెంచలయ్య ఇచ్చిన ప్రోత్సాహమే కారణం అని తెలిపారు. సభాధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ ప్రసన్న కష్టపడి సాధించిన ఈ బంగారుపతకం చైతన్య యోగా కేంద్రానికి గర్వకారణమన్నారు.

పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి

ప్రజాశక్తి-జలదంకి



పిడుగుపాటుకు గురై పశువుల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని అన్నవరంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో స్థానిక అరుంధతీయ కాలనీకి చెందిన ధనరాశి మాలకొండయ్య (70) మతి చెందారు. అరుంధతీయవాడకు ఉత్తరం వైపు గల ఆదిరెడ్డిగారి తోటలో గేదెలు మేపుకుంటుండగా సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దాంతో ఈ దుర్ఘటన జరిగింది. సాయంత్రానికి గేదలు ఇంటికి రాగా మృతుడు మాలకొండయ్య రాకపోవడంతో కుటుంబ సభ్యులు తోటలోకి వెళ్లి పరిశీలించగా పిడుగుపాటుకు గురై మృతి చెంది ఉండడానికి గుర్తించారు. ఆ కుటుంబానికి ఆయన పెద్దదిక్కుగాక ఇలా అర్ధాంతరంగా మృతి చెందడం ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. ఈ సంఘటనతో కాలనీలో విషాద ఛాయలు అమ్ముకున్నాయి.



'ఉపాధి' కూలీలకు బయోమెట్రిక్ నిర్వహిస్తున్న దృశ్యం

'ఉపాధి'లో బయోమెట్రిక్

ప్రజాశక్తి-వింజమూరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరింత పారదర్శకత చేకూర్చేందుకు ఆధార్ అనుసంధానిత బయోమెట్రిక్ విధానంలో ఉపాధి శ్రామికుల హాజరును నమోదు చేసే విధంగా చర్యలు చేపట్టుటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఉపాధి హామీ కూలీలకు బయోమెట్రిక్ నిర్వహించారు. అందులో భాగంగా మొదటగా మండలంలోని జాబ్ కార్డ్ కలిగిన అందరూ సభ్యుల ఈకేవైసీ తీసుకోవడం జరుగుతుందన్నారు. జాబ్ కార్డు కలిగిన సభ్యుల అందరి ఈకేవైసీ పూర్తయిన తర్వాత పూర్తిస్థాయిలో పని ప్రదేశంలో ఉపాధి శ్రామికుల హాజరును ఆధార్ అనుసంధానిత బయోమెట్రిక్ విధానంలో తీసుకోవడం జరుగుతుంది. దీని ద్వారా ఒక జాబ్ కార్డుపై ఇతరులు పనిచేయడం, గ్రామాలలో లేని వారి కి హాజరు వేయడం వంటి అవకతవకలు లేకుండా నివారించడానికి వీలు కలుగుతుందన్నారు. తద్వారా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరింత పారదర్శకత చేకూరనుందని తెలిపారు. ప్రస్తుతం వింజమూరు మండలంలో 8290 ఆక్టివ్ జాబ్ కార్డులలో 12402 మంది యాక్టివ్ వర్కర్లు ఉన్నారు. వీరందరి నుండి ఉపాధి హామీ సిబ్బంది ప్రస్తుతం ఈకేవైసీ సేకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల స్థాయిలో ఏపీఓ, ఎంపీడీవో పర్యవేక్షిస్తారన్నారు.



ఎస్‌పి చేతుల మీదుగా ప్రతిభా అవార్డును అందుకుటుంన్న కానిస్టేబుల్

ప్రతిభ అవార్డు అందజేత

ప్రజాశక్తి-దగదర్తి

దగదర్తి పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు వి.కృష్ణ, ఎన్.అనిల్ లు జిల్లా ఎస్‌పి అజిత వేజండ్ల చేతుల మీదుగా ప్రతిభ అవార్డులను ఆదివారం అందుకున్నారని దగదర్తి ఎస్ఐ జంపాని కుమార్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన పనితీరు కనపరిచిన ఉద్యోగ విధిని బాధ్యతగా నిర్వహిస్తూ మంచిపేరు తెచ్చుకొని ప్రతిభా అవార్డు ఎంపికయ్యారన్నారు. అంతేగాక దగదర్తిలో కూడా పనిపై బాధ్యతగా వ్యవహరిస్తూ వచ్చిన అర్జీదారులతో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ ముందుకు వెళ్లడంతో అర్జీదారులు కూడా వారి అభినందిస్తున్నారన్నారు. అంతేగాక నియోజకవర్గంలో దగదర్తి స్టేషన్‌లోనే ప్రతిభ అవార్డుకు ఇద్దరు ఎంపికవడం చాలా సంతోషంగా ఉందని వారు తెలిపారు. స్టేషన్లో ఉన్న మిగతా సిబ్బంది కూడా పనిపై మంచి ప్రతిభ కనబరిచి వారు కూడా ప్రతిభా అవార్డులు అందుకోవాలని కోరుకుంటున్నానన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఐ సైదులు మండల పరిధిలోని షాపు యజమానులకు సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్ దొరసానమ్మ వెలసి ఉన్న ఎఎస్‌పేటలో నిరంతరం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి దర్శనార్థం వస్తూ ఉంటారని, అదేవిధంగా ఆకతాయిలు షాపులకు వస్తూ ఉంటారని కనుక విషయాన్ని ప్రతిఒక్కరూ తూ.చా. తప్పకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకొని సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ భాస్కర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటిపై ప్రమాదకరంగా ఉన్న కరెంటు తీగలు

ఇంటిపై కరెంట్ తీగలు తొలగించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

సీతారాంపురం మండలం పడమటి రొంపిదొడ్ల గ్రామంలో ఇంటిపై వేసిన కరెంట్ తీగలను తొలగించాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య స్థానిక ప్రజలతో కలిసి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో స్థానిక ప్రజలు ఇంట్లో లేనప్పుడు విద్యుత్ సంబంధిత సిబ్బంది విద్యుత్ తీగలను ఇంటిపై లాగి వారి ప్రాణాలతో చెలగాటమాడుతూ వారిని భయభ్రాంతులకు గురిచేయడంతో అనుక్షణం ఏం జరుగుతుందో అనే భయంతో జీవనం గడుపుతున్నారన్నారు. గాలి రావడంతో ఇంటిపై ఉన్న తీగలు రాపిడితో మంటలు చెలరేగి 3 ఫేస్ ట్రాన్స్‌ఫారంలో మంటను చెలరేగే ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఎప్పటికీ రెండుసార్లు ట్రాన్స్‌ఫార నుండి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని ఇటీవల ట్రాక్టర్‌పై వెళ్తున్న వారిపై ట్రాన్స్‌ఫారం దగ్గర మంటలు చెలరేగడంతో తృటిలో ప్రాణప్రయాణం తప్పిందని వెంటనే సంబంధిత అధికారులు గ్రామ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తక్షణ చర్యలో భాగంగా ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని ఆయన కోరారు.



రెడ్‌క్రాస్‌లో పలువురి రక్తదానం

ప్రజాశక్తి-కావలి

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, దివం గత ప్రజాసంఘాల నాయకుడు అన్నం సుబ్బారావు 13వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో పలువురు ఉపాధ్యాయులు, అన్నం సుబ్బారావు కుటుంబ సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అన్నవరం వెంకట హనుమకుమార్ 68వ సారి, బండా వెంకట కృష్ణారెడ్డి 11వ సారి, అన్నం కిరణ్ 20వ సారి రక్తదానం చేయడం విశేషం.

కార్పొరేట్ల పాలవుతున్న కార్మికుల కష్టం

ప్రజాశక్తి-నెల్లూరు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సతీష్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల, కష్టజీవుల శ్రమను కార్పొరేట్లకు దోచిపెడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యన్.సతీష్ పేర్కొన్నారు. సిఐటియు నెల్లూరు రూరల్ మండలం మహాసభ ఆదివారం నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాలెం గ్రామంలో గాజుల శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలో పాల్గొన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.సతీష్, సిఐటియు సీనియర్ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేడు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు కష్టజీవుల కార్మికుల శ్రమను కార్పొరేట్ల కు దోచిపెడుతుండడం వల్లే దేశంలో అసమానతలు పెరుగుతున్నా యని విమర్శించారు. దానిలో భాగంగానే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎల్ఐసి, రైల్వే, బ్యాంకులు, విశాఖ ఉక్కు లాంటి ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్లకు దోచి పెడుతుంటే, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో 8 గంటల పని విధానాన్ని ఎత్తివేసి 10 గంటల నుంచి 12 గంటల పని విధానాన్ని తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఇది కార్మికుల కష్టజీవుల శ్రమను కార్పొరేట్లకు దోచిపెట్టి అసమానతలు పెంచడమేనని అన్నారు. సిఐటియు అసంఘటిత రంగ కార్మికుల, కష్టజీవుల హక్కుల కోసం పోరాడుతుందని దానికోసం 11, 12వ తేదీలలో తోటపల్లి గూడూరు మండలం నరుకూరులో జరుగుతున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. మహాసభ అనంతరం 11మందితో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు గా గుంటి నాగరాజు, పాదర్తి నారాయణ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా పార ప్రగతి, సతీష్, సుబ్రహ్మణ్యం, పాదర్తి.మధు, ఎస్.ఏడు కొండలు డక్కా సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఈ ఎస్ బాబు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు, అంగన్‌వాడీ నాయ కులు పాదర్తి.నాగభూషణమ్మ, శ్రీదేవమ్మ, అనసూయమ్మ, ఐఎంఎల్ డిపో నాయకులు యెగ్గోలు.భాస్కర్, కూకటి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు గుంటి నాగరాజు, పాదర్తి నారాయణ

'చిత్ర'స్మరణీయుడు బాపిరాజు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

చిత్రకారునిగా, నవలా రచయితగా, కవిగా విభిన్న పాత్రలు పోషించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అడివి బాపిరాజు అని గ్రంథపాలకులు అల్లాడి నరసింహ రావు అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం శాఖా గ్రంథాలయంలో ఆదివారం అడివి బాపిరాజు 130వ జయంతి సందర్భంగా ఘన నివాళు లర్పించారు. సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి స్వాతంత్ర్య ఉద్యమాలలో క్రియాశీల పాత్ర పోషించారన్నారు. నవ్య సాహిత్య పరిషత్ ఏర్పాటు చేసి ఎందరో చిత్రకారులను తయారు చేశారని, ఆకాశవాణి రేడియో కేంద్రంలో సలహాదారుడుగా, పాత్రికేయ సంపాదకుడిగా సేవలందించిన ఘనత బాపిరాజు కే దక్కుతుందన్నారు. చదువుల ఒత్తిడిలో కొట్టు మిట్టాడుతున్న నేటితరం చిత్రకళా నైపుణ్యంతో సేద తీరవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అడవి బాపిరాజు పురస్కార గ్రహీత గండికోట సుధీర్ కుమార్, ఉపాధ్యాయులు సురేంద్ర, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



బాపిరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

7న వాల్మీకి జయంతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

నెల్లూరు పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద తిక్కన భవన్‌లో 7వ తేదీ 10గంటలకు వాల్మీకి జయంతి నిర్వహించనున్నట్లు వాల్మీకి బోయ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు నల్లబోతుల వెంకటేశ్వర్లు ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని రాజకీయ ప్రతినిధులు ప్రముఖులు వాల్మీకి బంధువులకు అన్ని కుల సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. వాల్మీకి బోయ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు నల్లబోతుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, శివరామయ్య ప్రధాన కార్యదర్శి బిసి కోటయ్య, వెంకటరావు, తిరుపాలు, వెంకటసుబ్బయ్య, జిల్లా కమిటీ సభ్యులు జిల్లాలోని అన్ని మండలాల కమిటీ సభ్యులు పాల్గొంటున్నారు.

శాస్త్రీయ క్రిమిసంహారకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

మాక్స్ క్లీన్ టూఇన్ వన్ ఫ్లోర్ క్లీనర్‌ను శాస్త్రీయంగా రూపొందించబడినదని, విప్రో బిజినెస్ డెవలప్మెంట్ జీఎం ఉషాసిస్ సాహ ఆదివారం ప్రకటనలో తెలిపారు. విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ హౌస్‌కు చెందిన ప్రముఖ బ్రాండ్ మాక్ క్లీన్‌ఫ్లోర్ క్లీనర్ క్రిమిసంహారకం ఆవిష్కరించారని తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరలో లభ్యమవుతుందని, గచ్చును క్రిమిరహితం చేసి కఠినమైన ధూళి, దుమ్మును తొలగిస్తుందని తెలిపారు. అలాగే పలు రకాల కీటకాలను నిర్మూలిస్తుందని తెలిపారు. మాక్ క్లీన్ డ్యూయల్ యాక్షన్ ఫార్ములాతో శాస్త్రీయంగా తయారు చేయబడిందని తెలిపారు. ప్రామాణిక క్రిమిసంహారిణి, ప్రయోజనాన్ని వినియోగదారులు పొందుతారని తెలిపారు. విప్రో మాక్ క్లీన్ లోతుగా గచ్చును శుభ్రపరచడాన్ని ప్రభావవంతమైన కీటకాల వికర్షణతో మిళితం చేస్తుందని తెలిపారు. ఆధునిక జీవనశైలికి సరిపోయే గహ సంరక్షణ ఈ క్రిమిసంహారకం అని తెలిపారు.



నేటి నుంచి భూసర్వే

ప్రజాశక్తి-ముత్తుకూరు

రాష్ట్ర రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా సోమవారం నుంచి ముత్తుకూరు గ్రామ పంచాయతీలో భూముల రీసర్వే ప్రాజెక్టు ప్రారంభమవుతుందని తహాశీల్దారు స్వప్న ఆదివారం తెలిపారు. మూడో విడతలో సర్వే చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. సర్వే అధికారులు భూములు సర్వే చేస్తున్న సమయంలో రైతులు అందుబాటులో ఉండి తమ వద్ద ఉన్న భూమి యాజమాన్య హక్కు పత్రాలు, ఆధార్ జెరాక్స్ కాపీ పత్రాలను దగ్గర ఉంచుకోవాలని తహాశీల్దారు రైతులకు తెలియజేశారు. రైతుల సమక్షంలోనే సర్వే జరుగుతుందని తహాశీల్దారు తెలిపారు. రెండ్రోజుల క్రితం ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించామని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సచివాలయ సిబ్బంది న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కావలి

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయిని మహిళా సామాజిక కార్యకర్త చాకలకొండ శారద ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019-24 మధ్య ప్రభుత్వం 'నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం గ్రామ వార్డు సచివాలయాలను రూపొందించిందన్నారు. ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను సులువుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కొత్త విధానాన్ని తీసుకొచ్చారన్నారు. దానికింద గ్రామాల్లో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను ఇంటి వద్దకే చేర్చేవారన్నారు. వాలంటీర్లు కరోనా కష్టకాలంలో సచివాలయ సిబ్బంది చేసిన సేవలు అపూర్వమన్నారు. ఇంటింటికి రేషన్ పంపేవారన్నారు. వాలంటీర్లను తొలగించాక, సచివాలయం సిబ్బంది వాలంటీర్ల పనిని కూడా తమ విధులతోపాటు నిర్వహించాల్సి వచ్చిందన్నారు. ఇది వాళ్లకు పనిభారాన్ని పెంచిందన్నారు. దానికి తోడుగా సర్వేలు కూడా చేయాలనడం వల్ల సచివాలయ ఉద్యోగులు అవిశ్రాంతంగా పని చేస్తున్నారన్నారు. వారికి నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు నిరసన కార్యక్రమానికి దిగారన్నారు. వాటిని అణచివేసేందుకు ప్రభుత్వం యంత్రాంగాన్ని పంపడం దారుణమన్నారు. గాంధేయ మార్గంలో శాంతియుత నిరసనలు తెలియజేసే ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరగరాదన్నారు. వెంటనే ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. వారికి న్యాయం చెయ్యాలని కోరారు.



సౌత్‌మోపూరు చేనేతలతో రాష్ట్ర నాయకులు

'చేనేత అధ్యయన యాత్ర'

ప్రజాశక్తి-నెల్లూరు

చేనేత పరిరక్షణకు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త చేనేత అధ్యయన యాత్రలో భాగంగా ఆదివారం నెల్లూరు రూరల్ మండలంలోని ములుమూడి, సౌత్ మోపూరు, సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలంలోని తాటిపర్తి గ్రామాలలో నిర్వహించారు. ఈ అధ్యయన యాత్రలో భాగంగా చేనేతలు పడుతున్న కష్టాలను వాళ్ల నుండి సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. చేనేతలకు రావాల్సిన బకాయిలు గత పది సంవత్సరాలుగా రూ.127.85 లక్షలు ప్రభుత్వం నుండి రావాల్సి ఉందని, ఈ బకాయిలు వెంటనే చెల్లించి చేనేత కార్మికులకు అండగా నిలవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కోరుకుతున్నామన్నారు. రాబోయే కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో రూ.2వేల కోట్లు ప్రవేశపెట్టాలని చేనేత కార్మికులు చేనేత నాయకులు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, రాష్ట్ర సహాయ కార్యదర్శి పముజల హరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చేనేత నాయకులు ఆకురాతి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపికి ఎంఎల్ఎ కృష్ణారెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-జలదంకి

జలదంకి ఎంపిపి గోచిపాతల వెంకటరమణయ్య ఆదివారం కావలి ఎంఎల్ఎ దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి (కావ్య) పరామర్శించారు. ఎంపిపి ఇటీవల కంటి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కావలి ఎంఎల్ఎ 9వ మైలులోని ఎంపిపి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. కావలి ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి 9వ మహిళకు వచ్చారాన్న విషయం గ్రామంలో దావనంలా వ్యాపించడంతో స్థానికులంతా కావలి ఎంఎల్ఎను చూసేందుకు గుమ్మిగుడారు. ఎంఎల్ఎవెంట టిడిపి మాజీ మండల కన్వీనర్ చిత్తాబత్తిన మస్తాన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



ఎంపిపి వెంకటరమణయ్యను పరామర్శిస్తున్న కృష్ణారెడ్డి